
సంక్రాంతి ప్రత్యేకమ్!

# శకుంతల స్వగతం



ప్రపంచమంతా మోసమూ, దగాయేనా? లేక నా బ్రతుకే అంతా? అవును నా జన్మే అంత. నేను శాపగ్రస్తను. నాజన్మ వృధా; నా బ్రతుకు వ్యర్థం.

పుట్టినప్పుడే తల్లి దండ్రులకు దూరం అయ్యాను. కన్నతల్లికే బరువైపోయాను. నిర్దయతో పక్షుల పాలిట పారేసి తన దారిన తాను వెళ్ళిపోయింది జన్మనిచ్చిన తల్లి. దయామయుడు కణ్వమహర్షి కరుణించి కాపాడక పోతే అభం, శుభం తెలియని తన జీవితం ముగిసి పోయేది. అలా జరిగితేనే బాగుండేదేమో? ఈనాడు, ఇంత అవమానం పాలు కాకుండా ఉండేది. కన్నతండ్రి కంటే మిన్నగా కరుణించి కాపాడి పెంచిన ఆ మహాత్మునికి కూడా అపకీర్తిని తెచ్చి పెట్టింది తను.

అవమానంతో, క్షణంక్షణం, కణంకణం దహించుకు పోతూ ఇంకెంతకాలం ఈ మారీచ ఆశ్రమంలో జీవించాలో?

కన్నతల్లి త్యజించింది.
కన్న తండ్రి తిరస్కరించాడు.

మనస్సాక్షిగా గాంధర్వ వివాహం చేసుకొన్న భర్త తిరస్కరించాడు. తిరస్కృతి!తిరస్కృతి!

అసలు ఆడబ్రతుకే ఇంతా? కన్న తండ్రి తిరస్కారాన్ని సహించలేక పార్వతి ఆత్మాహుతి చేసుకొన్నది. ఎందుకు? ఆ పరిస్థితిలో భర్త దగ్గరకు తిరిగి వెళ్తే తిరస్కారం తప్పదనేగా?

స్త్రీ దేవతా స్వరూపిణి అయినా మునుల తపోభంగానికి ఒక సాధనమేగా? తన తల్లి అసహాయురాలు. అందుకేగా కడుపుతీపిని చంపుకుని తనను త్యజించింది?

నిండుసభలో తనకు ఎంత అవమానం జరిగింది? ఘోర అవమానం! తిరస్కారం! ధర్మాన్ని నాలుగు పాదాలా నడిపిస్తూ, రాజ్యపరిపాలన చేస్తున్న మహారాజట. ఆదర్శ మూర్తులట. పురు వంశానికి కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింప జేస్తున్నరారాజట. మనస్సాక్షిగా పెళ్లాడిన స్త్రీని గుర్తించనట్టే నటించాడు ఆ మహారాజు.

అతడు అంతకుముందెన్నడూ తనను చూడనేలేదట. పచ్చి అబద్ధం. దుర్మార్గం. పురుష దురహంకారం. తనలో జీవం పోసుకొంటున్న తన ప్రతిరూపాన్ని చూసినా అతడి మనస్సు కరగలేదు. ఎందుకని? రాముడు ఏం చేశాడు? నిండు గర్భవతి అయిన సీతమ్మను నిర్దాక్షిణ్యంగా అడవిపాలు చేశాడు. ఎందుకని? ఎవడో ఏదో అన్నాడనేగా? ఆదర్శరాజుగా కలకాలం నిలిచిపోవాలనేగా? తనను గుర్తించనట్టే నటించాడు ఆ దుష్యంత మహారాజు.

తన తండ్రిగారి శిష్యులైన శారద్వాతుడూ, శార్ఙ్గరవుడూ ఎంతచెప్పినా చెవికెక్కించుకోలేదు. ఆశ్రమవాసులనే గౌరవం కూడా లేకుండా, వారే అబద్ధాలాడుతున్నట్టు అవమానించాడు. తన అత్త గౌతమి ఎంత ప్రాధేయ పడినా లెక్కచెయ్యలేదు ఆ మహారాజు.

ఆనాడు - తనను వేధించిన తుమ్మెదను ఎన్ని మాటలు అన్నాడు? దాన్ని సంహరించి తనను రక్షించిన కరుణామూర్తిగా భావించింది. చివరకు అతడు చేసింది ఏమిటి? ఆ భ్రమరం కంటే నీచంగా ప్రవర్తించాడు. మాయమాటలు చెప్పాడు. తన మనసును దోచుకున్నాడు. పుష్పంలోని మధువును గ్రోలి, అభం శుభం తెలియని ఆ పుష్పాన్ని కొమ్మనుంచి తృంచి నలిపి విసిరి పారేశాడు.

హా! రాజటరాజు రక్షించవలసిన వాడే భక్షిస్తే ఎవరికి విన్నవించుకోవాలి?

ఎంత ప్రేమ నటించాడు. ఎన్ని కల్లబొల్లి కబుర్లుచెప్పి తనను గాంధర్వ వివాహానికి ఒప్పించాడు? అంతామోసం! దగా! వేట వంకతో ఆశ్రమంలో ప్రవేశించాడు. అంతవరకూ పొదలచాటున దాగి దొంగలా తనను గమనిస్తూ రక్షించే నెపంతో తనదరిచేరాడు. తన మనసును దొంగిలించాడు. తనను నమ్మించాడు. తనూ ఎన్నోకథలు విన్నది. దగాపడిన స్త్రీల కథలు విన్నది. అనాదిగా పురుషుడు స్త్రీని వంచిస్తూనే ఉన్నాడు. అయినా అతడు అందరి లాంటివాడు కాదని తను భావించింది. ఇదీ అనాదిగా వస్తున్నదే. తన రాజనీతిని తనమీద ప్రయోగించాడు. స్త్రీ బలహీనత అతడికి బాగా తెలుసు. తన సౌందర్యాన్ని ఎంతగానో ప్రశంసించాడు. మోజు తీర్చుకొన్నాడు. చివరకు తనెవరో తెలియనట్టే నటించాడు.

అసలు మొదటినుంచీ అతడు కపటనాటకమే ఆడాడు. తనే అర్థం చేసుకోలేదు. తను ఎవరో చెప్ప లేదు. అంతేకాదు. అబద్ధం చెప్పాడు. రాజుగారి ఆజ్ఞ మేరకు ఆశ్రమవాసులను బాధిస్తున్న మృగాన్ని వేటాడ డానికి వచ్చిన మహారాజు అనుచరుడిగా పరిచయం చేసుకున్నాడు.

తన ఇష్టసఖులు అనసూయా, ప్రియంవదలు ఎలా ఉన్నారో? వారు తనలాగే వేటకు వచ్చిన ఏ సామంత రాజుల మాయమాటల్లోనే పడిపోయారేమో?

స్త్రీ బ్రతుకేఅంత. అనాదిగా ఆడది మగవాడి స్వార్థానికి బలి అయిపోతూనే ఉంది.

మహారాజు ఆశ్రమాన్ని క్రూరమృగాల బారినుంచి రక్షించడానికి వచ్చినట్టు నటించాడు. కాని అతడి మనస్సులోని ఉద్దేశ్యమే వేరు. తన దాహం తీర్చుకొని, తన జీవితాన్ని నాశనం చెయ్యడమే అతడి ధ్యేయంగా పెట్టుకొని వచ్చాడు. అతడు చేసింది ఆశ్రమవాసుల రక్షణకాదు, భక్షణ.

ఎన్నెన్ని కల్లబొల్లి కబుర్లు చెప్పాడు? ఎన్ని బాసలు చేశాడు. అరచేతిలో వైకుంఠాన్నే చూపించాడు. ఆడ వాళ్ళను మైమరపించడం అతడికి వెన్నతో వచ్చిన విద్య.

తనను చూసిన దగ్గర నుంచి, తన సౌందర్యాన్నీ, తన శీలాన్నీ నాశనం చేసిపోదామన్న తొందర తప్ప మరొకటి కన్పించలేదు ఆ మనిషిలో తన తండ్రిగారి అనుమతి తీసుకొనేంతవరకు కూడా ఆగనిచ్చాడు కాదు. గాంధర్వ వివాహానికి తనను ఒప్పించాడు.

తనకు పుట్టే కొడుకే ఈ దేశమహారాజు అవుతా




డన్నాడు - కాదు - అతడికే రాజ్యాభిషేకం చేస్తానన్నాడు. స్త్రీ బలహీనత మీద దెబ్బ కొట్టి తన కోర్కె తీర్చుకున్నాడు.

కాబోయే చక్రవర్తి తల్లిగా ఊహించుకొన్న తన హృదయం ఆనందంతో తృళ్లి పడింది.

ఆరోజు - ఆయన ఆశ్రయం విడిచి వెళ్ళిపోతున్నరోజు దిగులుతో. దిగాలు పడిపోయిన తనను ఎన్ని విధాల ఊరడించాడు? ఎన్ని ప్రమాణాలు చేశాడు? వెళ్ళగానే మనమల్ని పంపి తన దగ్గరకు రప్పించుకుంటానన్నాడు. వియోగ దుఃఖంతో కుమిలిపోతూన్న తనను ఊరడిస్తూ అతడు చెప్పిన మాటలు ఇంకా చెవుల్లో మారుమ్రోగుతూనే ఉన్నాయి.

తన వేలి ఉంగరం తీసి తన వేలుకు పెడుతూ చెప్పిన మాటలు కూడా మర్చిపోయాడా? ఆ ఉంగరంలో మలచబడిఉన్న "దుష్యంతుడు" అనే పేరులో ఎన్ని అక్షరాలు ఉన్నాయో, అన్ని రోజులకు తనను తీసుకెళ్ళే ఏర్పాటు చేస్తానన్నాడే? అదికూడా గుర్తులేక పోయిందా? ఎందుకు గుర్తుండదూ? ఎందుకు గుర్తుండదూ? సింహాసనం మీద కూర్చున్న ఆమహారాజు ఒక సాధారణ మునికన్యను, పదిమంది మధ్యలో తన భార్యగా అంగీకరించలేక పోయాడు. తన కీర్తి ప్రతిష్ఠలు దెబ్బతింటాయని భావించాడు. అంతస్థులగోడ అడ్డం వచ్చింది. అందుకే తననుఎరగనట్టే నటించాడు.

వియోగ దుఃఖంలో ఆ ఉంగరాన్ని అహర్నిశలూ చూసుకుంటూ, ఆ పేరులోని ఒక్కొక్క అక్షరాన్నే మననం చేసుకొంటూ, ఆ రూపాన్నే మనసులో చిత్రించుకొంటూ ఒక్కొక్క క్షణమే ఒక యుగంకాగా, శ్రావణ మేఘాలు కమ్మిన కళ్లతో ఎదురుచూసింది తను. చివరకు ఏం జరిగింది? నిండు సభలో అవమానం!

అంతఃపుర కాంతలతో, మహారాజ వైభవాలను అనుభవిస్తూ తన మాటే మర్చిపోయాడు. ఆత్మాభిమానం చంపుకొని తనే బయలుదేరి వెళ్ళింది. తన ప్రాణ సమానంగా పెంచుకున్న లేడిపిల్లనూ, మాధవీలతనూ, తనను తమ ప్రాణంకంటే మిన్నగా ప్రేమించిన అనసూయా ప్రియంవద లను, కన్నకూతురి కంటే మిన్నగా పెంచిన ఆ మహర్షినీ, అందర్నీ వదిలేసి వెళ్ళింది. తన సర్వస్వాన్నీ సమర్పించుకొన్నదే?. అసహాయంగా, నిండు సభలో బిక్కుబిక్కు మంటూ నిల్చొని దీనంగా ప్రాధేయపడింది. అయినా ఆయన గుండె కరగలేదు. అది గుండెకాదు నల్ల రాతిబండ.

కన్నెత్తి కూడా చూడలేదు పాపండుడు.

పైగా వరపురుముని భార్యనట! వరాయి ఇల్లాలిని కన్నెత్తి చూడడట. ఎన్ని ధర్మపన్నాలు వల్లించాడు? పురుమడు కనక అతడు ఏమన్నా చెల్లింది. తనతల అవమానబారంతో వంగిపోయింది.

అసలు పురుమలంతా ఇంతేనా? స్త్రీలంటే ఎంత చులకన? ధర్మనిరతుడనీ, న్యాయపాలకుడనీ కీర్తి గడించిన మహారాజే ఇలా ప్రవర్తిస్తే, మిగతా వారి విషయం వేరే చెప్పాలా? మగవారి మోసాలకు అంతం లేదా? -దీన్ని అరి కట్టే వారేలేరా?

ఇంతకీ ఎవర్నో దూషించి ప్రయోజనం ఏమిటి? తన నొనటివ్రాత అలా ఉంది. కాకపోతే ఆ ఉంగరం పోవాలా? వేలుకున్న ఉంగరం మళ్లీ సభలో చూసుకొనే వరకూ అది పోయినట్టే తనకు తెలియదు. ఆ ఉంగరమే ఉంటే? అతడి బండారం బయట పడేదికాదా?

తన మతిమరుపు మండిపోను! మార్గమధ్యంలో సరోవరంలో నీళ్లు తాగింది. అప్పుడే అది పడిపోయి ఉంటుంది. ఉంగరం చూపించలేకపోయిన తనను ఎన్ని మాటలు అన్నాడు. అసలే అవమానభారంతో కుచించుకుపోతున్న తన హృదయానికి అతని మాటలు ఈటెల్లా గుచ్చుకున్నాయి.

అతడు తననే మోసగత్తెగా చిత్రించాడు. ఎంత దారుణం. ఎంత దుర్మార్గం? ఆడవాళ్ళు చేసే మోసానికి అదొక తార్కాణం' అని ఎత్తిపొడిచాడు. పెళ్లయిన ఆడపిల్లను భర్త తిరస్కరిస్తే పుట్టింటివారూ తిరస్కరిస్తారు. ఆ దీన, హీన, స్థితిలో తనను వదిలేసి తన వాళ్ళు వెళ్లిపోయారు.

కన్నతల్లి మనసే వేరు.

స్ఫటికలాంటి సీతను రాముడు అగ్నిప్రవేశం చేసి శీలనిరూపణ చేసుకోమన్నాడు. ఆ మహాఇల్లాలి మనస్సు ఎంత బాధ పడిందో? అయినా సీత నోరు విప్పకుండా అగ్ని ప్రవేశం చేసింది. మళ్లీ రెండోసారి ఆదర్శమూర్తి, సీతను శీల నిరూపణ చేసుకోవలసిందిగా కోరినప్పుడు అవమానంతో ఆమె హృదయం బద్దలైంది. అభిమానం పెల్లుబికింది. తల్లి భూదేవిని ప్రార్థించింది తనను ఆ అవమానభారం నుంచి కాపాడమని. సీతాదేవిని భూదేవి తన వెచ్చని వడిలోకి తీసుకొని ఆమెను రక్షించింది.

తనను కూడా తన తల్లి అక్కున చేర్చుకొని ఈ మారీచ ఆశ్రమం చేర్చింది. అలా జరగకపోతే తను ఏమై వుండేది? ఆత్మహత్యకు పాల్పడేది. తన గర్భంలో జీవం పోసుకుంటున్న తన బిడ్డ జీవితం కూడా తనతోపాటే ముగిసి పోయివుండేది.

అదుగో! నాబిడ్డ! నా జీవితపు ఏకైక ఆశాకిరణం. నా వరాల పంట. ఇదే వస్తున్నాడు. పులిపిల్లను ఎక్కి వస్తున్నాడు.

ఆ మహారాజు వచ్చి మళ్ళీ తనను స్వీకరిస్తాడనే ఆశతో తను జీవించడంలేదు. తన బిడ్డకోసం తను జీవిస్తోంది.

తన బిడ్డ ఈ దేశానికి చక్రవర్తి అవుతాడు. తనపేరు చక్రవర్తి తల్లిగా ఆచంద్రతారార్కం చరిత్రలో ఉండి పోతుంది!

—వాసిరెడ్డి సీతాదేవి

(ఇది రేడియో ప్రసంగంగా 1969లో వ్రాయబడినది)